
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023





## 9న నన్నయ్యలో జాబ్ మేళా

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఈనెల 9న మెగా జాబ్ మేళా జరుగుతుందని అని తూర్పు గోదావరి జిల్లా వైసిపి అధ్యక్షుడు, స్థానిక ఎంఎల్ఎ జక్కంపూడి రాజా అన్నారు. రాజానగరం మండలం నరేంద్రపురంలో గడప..గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనిలో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ జిల్లా ప్రత్యేక అధికారి ఎం.చంద్రశేఖర్ రెడ్డి జాబ్ మేళా పోస్టర్ ను విడుదల చేశారు. దీనిపై ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఈ జాబ్ మేళాకు 14 కంపెనీలో సుమారు 630 నిరుద్యోగులకు విద్యా అర్హత ఆధారంగా ఉద్యోగాలు వస్తాయన్నారు. వివరాలకు ఈ 7989656834, 9581810049 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు. ఎపిరాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ జిల్లా మేనేజర్ కొండలరావు పాల్గొన్నారు.

# బడి బస్సు భద్రమేనా ?

- సమీపిస్తున్న విద్యాసంస్థల పున్ణప్రారంభం గడువు
- జిల్లాలో 700లకు పైగా ప్రైవేట్ పాఠశాలల బస్సులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాలల ప్రారంభం సమీపిస్తున్న వేళ బడి బస్సులు భద్రమేనా..? అనే ప్రశ్న తలెత్తుతోంది. మరో వారం రోజుల్లో బడులు ప్రారంభం కానున్న విషయం విదితమే. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నాణ్యమైన విద్య నందిస్తున్నామని ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. విద్యార్థులను గ్రామాల నుంచి పిల్లలను పట్టణంలోని పాఠశాలలకు తీసుకొచ్చేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నాయి. విద్యార్థులను రవాణా చేసినందుకు రవాణా ఛార్జీలను కూడా వసూలు చేస్తున్నారు. అయితే విద్యాసంస్థల యజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు పాటించకుండా బస్సులను నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పలుమార్లు విద్యాసంస్థలకు చెందిన బస్సులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. బస్సు సీట్లకు మించి విద్యార్థులను ఎక్కువగా చేరవేస్తున్నాయి. అయితే బస్సుల ఫిట్‌నెస్‌ను డ్రైవర్ కండీషన్‌ను పట్టించుకోవడం లేదు. ఇలాంటి బస్సులపై దష్టి సారించి పిల్లలకు ఎలాంటి ఆపద ఏర్పడకూడదని ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఫిట్‌నెస్‌కు సంబంధించిన పరీక్షలు చేయాలని నిర్ణయించింది. అందుకుగాను ప్రతీ సంవత్సరం బస్సులకు అందించే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల స్కూల్స్ ప్రారభానికి ముందే ముగిసేట్లుగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతిఏడాది అధికారులు బస్సులు ఎంత మేర ఫిట్‌నెస్ ఉన్నాయనే దానిపై తనిఖీలు చేస్తూ విద్యాసంస్థల పున్ణప్రారంభం వరకు సర్టిఫికెట్లను జారీ చేస్తుంటారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా ఫిట్‌నెస్ చర్యల్లో భాగంగా విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అయినప్పటికీ జిల్లాలోని పలు విద్యాసంస్థలకు చెందిన బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ చేయించుకోవడానికి ముందుకు రావడం లేదు.

### మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న పాఠశాలలు

తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు పాఠశాల భవనాలకు రంగులు వేస్తూ అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ విద్యార్థులను తరలించే వాహనాల ఫిట్‌నెస్‌పై మాత్రం దష్టి పెట్టడం లేదు. మరో వారం రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కావడం అప్పటిలోగా అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ నిర్వహించడం అంత సులువు కాదు. మరోవైపు కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడానికి వాహనాలకు తాత్కాలికంగా మరమ్మతు నిర్వహించి మమ అనిపించే ప్రయత్నాలు చేస్తున్నాయి. గతేడాది ఫిట్‌నెస్ పరీక్షలను నిర్వహించాల్సి ఉన్నా ఫిట్‌నెస్ ప్రక్రియ అంతంత మాత్రంగానే ఉంటున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గడువు ముగిసినా విద్యా సంస్థల బస్సులు యథేచగా తిరుగుతున్నాయని అధికారులు మాత్రం స్పందించడం లేదన్న విమర్శలు




ఉన్నాయి. ఈ సారైన యాజమాన్యాలు పాఠాలు నేర్చుకుంటాయా.. ధనార్జనే ధ్యేయంగా అర్హతలేని బస్సులకు మెరుగులు దిద్ది దర్జాగా తిప్పుతారా అన్న సందేహాలు విద్యార్థి సంఘ నాయకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

### ఫిటెనెస్ పరీక్షలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు

బడి బస్సు ఫిట్‌నెస్ అర్హత సాధించాలంటే అనేక నిబంధనలున్నాయి. కానీ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లు వదలుతున్నారన్న ఆరోపణలున్నాయి. పాత బస్సులకు కొత్త రంగులద్ది బస్సులను నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రవాణాశాఖ నిర్దేశించిన ప్రమాణాలు యాజమాన్యలు పట్టించుకోవడం లేదని విమర్శలు లేకపోలేదు. జిల్లాలో రవాణాశాఖ అధికారిక లెక్కల ప్రకారం 700లకు పైగా బడి బస్సులున్నాయి అందులో జిల్లా కేంద్రానికి చుట్టు పక్కల ఉన్న మండలాల్లోనే ఎక్కువగా పాఠశాలలు ఉండడం ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా గడువు చివరి వరకు వేచి ఉండి హడావుడిగా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని చూస్తున్నట్లు సమాచారం. అందుకు ఉదాహరణనే ఆర్‌టీఏ కార్యాలయంలో నమోదు అయిన ఫిట్‌నెస్ బస్సుల సంఖ్య వివరాలు. ఏటా పాఠశాల పున్ణప్రారంభం నాటికి ఫిట్‌నెస్ కోసం బస్సులను రవాణా శాఖ కార్యాలయానికి తీసుకెళ్తున్నా విద్యా సంస్థల నిర్వాహకులు వారికి సంబంధించిన ఏజెంట్ల ద్వారానే బడిబస్సును ఫిట్‌నెస్‌కు తీసుకె ళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే నిబంధనల ప్రకారం ఉంటేనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. బడి బస్సుల ప్రమాణాలపై ప్రతీ ఏడాది లాగానే.. ఎన్నో అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. యాజమాన్యాలు ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటిస్తున్నాయా.. లేదా.. ఒకవేళ ఫిట్‌నెస్ లేకపోయినా అధికారులు చూసీచూడనట్లుగా వదిలేసి వాటికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారా...? అనే ప్రశ్నలు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు సరిగా లేని బస్సులకు చిన్న చిన్న మరమ్మతులు చేసి రంగులు వేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఫిట్‌నెస్ పరీక్షలకు పంపుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో వారం రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి వరకు ఫిట్‌నెస్ పరీక్షలపై పూర్తి స్థాయిలో దష్టి సారించని అధికారులు హడావుడిగా ఆ ప్రక్రియను పూర్తిచేసే అవకాశం ఉందని, తద్వారా ఈ పరీక్షలు తూతూ మంత్రంగా సాగుతాయని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలు చోట్ల బస్సులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో వాటి ప్రమాణాలపై అధి . కారులు పకడ్బందీగా వ్యవహరించాల్సిందేనని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు.

### ఫిటెనెస్ నిబంధనలు ఇలా..

బస్సుకు నాలుగు వైపుల పైభాగం మూలల్లో బయటివైపు గాడ పసుపుపచ్చని రంగు గల ఫ్లాషింగ్ లైటు అమర్చాలి. విద్యార్థులు బస్సు నుంచి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు, ఈ లైట్లను వెలిగించాలి. బస్సు ముందు భాగంలో 400 ఎంఎం సైజు బోర్డును పాఠశాల పేరుతో రాయించి అమర్చాలి. ఈ బోర్డుపై 250 ఎంఎంలకు తగ్గకుండా ఇద్దరు పాఠశాల విద్యార్థుల బొమ్మలను నల్లరంగులో చిత్రీకరించాలి. ఈ చిత్రం కింద స్కూల్ బస్సు అని నల్లరంగులో కనీసం 100 ఎంఎం అక్షరాలతో రాయాలి. ప్రతీ విద్యాసంస్థ సీటింగ్ కెపాసిటీ కన్నా ఎక్కువగా విద్యార్థులను తీసుకొని వెళ్లరాదు. ప్రతీ విద్యాసంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్టు శాఖ, పోలీస్ శాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సంవత్సరానికి ఒకరోజు రోడ్‌సేఫ్టీ తరగతులు నిర్వహించాలి. బస్సు ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు నుంచి 325 ఎంఎం ఎత్తుకు మించరాదు. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహాలతో అమర్చాలి.బడి బస్సును నడిపే డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించరాదు. బస్సు, డ్రైవర్ పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. డ్రైవర్‌కు హెవీ లైసెన్స్‌తో పాటు ఐదేళ్ల అనుభవం ఉండాలి. ఆరోగ్య పరిస్థితిని మూడు నెలలకు ఒకసారి యాజమాన్యమే చెక్ చేయించాలి. ప్రతి నెలా స్కూల్ ప్రిన్సిపల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి.బస్సులో ప్రథమ చికిత్స బాక్స్ ఉండాలి. ఇవి ఉన్నట్లు తెలిసేలా పెద్ద అక్షరాలతో రాయించాలి.ఇంజన్, బాడీ కండీషన్‌లో ఉండాలి. కన్వెక్షన్ క్రాస్ మిర్రర్ ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలి. బ్యాగ్‌లను భద్ర పరుచుకునేందుకు సీట్ల కింద ర్యాక్‌లు ఉండాలి. బస్సు తయారైన తేది నుంచి 15 ఏళ్లు మించకూడదు. పూర్తి స్థాయిలో బీమా, రవాణా పన్నులు చెల్లి ంచి ఉండాలి. విద్యాసంస్థలు నిర్వహిస్తున్న వారి సెల్ నెంబర్ సహ పూర్తి చిరు నామా బస్సు ఎడమ భాగంలో, ముందు భాగంలో కనపడేలా రాయించాలి.

### బడి బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా తీసుకోవాలి

బడి బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి. డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. జిల్లాలో సుమారు 700 బస్సులు ఉన్నాయి. ఇప్పటి వరకూ 500 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు జరిగాయి. పాఠశాలలు ప్రారంభం నాటికి యాజమాన్యాలు తమ బస్సులకు ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోవాలి. లేకపోతే నిబంధనల ప్రకారంచర్యలు తీసుకుంటాము.

**-ఎ.కృష్ణారావు, జిల్లా రవాణాశాఖ అధికారి, తూర్పుగోదావరి జిల్లా**



స్టాక్ పాయింట్ వద్ద విద్యాశాఖాధికారులు తదితరులు

## స్కూళ్ల ప్రారంభం రోజే జెవికె కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-గోపాలపురం

స్కూళ్ల ప్రారంభం రోజునే జెవికె కిట్లు విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కొయ్యలగూడెం ఉప విద్యాశాఖ అధికారి రామన్న దొర అన్నారు. మంగళవారం పాఠశాలకు విద్యా కానుక కిట్లు గోపాలపురంలోని బిసి గురుకుల పాఠశాలలో జెవికె 4 స్టాక్ పాయింట్ ను కోయిలగూడెం ఉప విద్యాశాఖ అధికారి రామన్న దొర, మండల విద్యాశాఖ అధికారి జి. శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల్లో పాఠశాలలు పున ప్రారంభం కానున్నాయని అన్నారు. ముందుగానే జెవికె కిట్లు ఆయా పాఠశాలలకు చేరుతాయన్నారు. స్కూల్ తెరిచిన రోజునే వాటిని విద్యార్థులకు అందజేస్తారన్నారు. కోయిలగూడెం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి డివిజన్ పరిధిలో పనులు శరవేగంగా సాగుతున్నాయి అన్నారు. విద్యాశాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు అందించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశారని తెలిపారు. జగనన్న విద్యా కానుక అయినా బ్యాగ్, యూనిఫామ్, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, షూస్, సాక్స్, బెల్ట్ లను స్టాక్ పాయింట్ వద్ద విద్యాశాఖ అధికారులు స్కూల్ హెచ్ఎంలు పర్యవేక్షణ చేస్తున్నట్లు స్కూల్ ప్రారంభం రోజునే ఈనెల 12న విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేస్తున్న జెవికె కిట్ల విషయంలో దృష్టి సారించాలని సూచించారు. నాణ్యమైన కిట్లనే విద్యార్థికి అందేలా ఏర్పాట్లు చేస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యా యులు సిఆర్పిలు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో వరి విత్తనాలు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం సొసైటీలో రైతులకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని గోకవరం సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సాగు కోసం గోకవరం సొసైటీలో వరి విత్తనాలు వున్నాయని అందులో పలు రకాలు 1061 రకం రూ.11వందలు, 1064రకం రూ.11వందలు, పిఎల్ రకం రూ.11వందలు, బిపిటి సాంబ రకం రూ.930 రూపాయలు వరి విత్తనాలు ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు గోకవరం సొసైటీలో సంప్రదించి తెచ్చుకోవాలని ఈ అవకాశం ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు తెలిపారు.



పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ

## ఉండ్రాజవరం ఎంపిడిఒగా రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఉండ్రాజవరం


ఉండ్రాజవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జివిఎస్ఆర్ కె.రాజు మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నరసాపురం లో పరిపాలనా అధికారిగా పనిచేసిన రాజు ఉద్యోగ ఉన్నతిపై ఉండ్రాజవరం ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. హౌసింగ్ ఎఇ, సిబ్బంది, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, జాతీయ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ బృందం, మండల యుటిఎఫ్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు.

## ఆయా పోస్టులకు దరఖాస్తుల సీక్వరణ

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి ఐసిడిసిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధి పెరవలి ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లోని ఆరు గ్రామాల్లో అంగనవాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సిడిపిఒ ఎం.శ్రీలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ జీడిగుంట- వి.హెచ్, ఖండ వల్లి- హియరింగ్ హ్యాండీక్యాప్డ్ పెండ్యాల 1-ఓపెన్ క్యాటగిరి, సత్యవాడ 1-ఎస్‌సి, ఉండ్రాజవరం 8-ఒపెన్ క్యాటగిరి సమిస్ర గూడెం 2-బిసిబి అర్హత కలిగిన అభ్యర్థులు 13న దరఖాస్తులు స్వయంగా అందజేయాలన్నారు.

### కార్టూ'నిజం'




## గ్రంథాలయాలు జ్ఞానానికి నిలయాలు



గోపాలపురంలో చదరంగ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని గోపాలపురం గ్రంథాలయం పాలకుడు వి.సత్యనారాయణ సూచించారు. మంగళవారం గోపాలపురం శాఖ గ్రంథాలయం నందు వేసవి శిక్షణ శిబిరం 30 రోజు సందర్భంగా విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయాల నందు ఉన్న ఎన్నో రకాల పుస్తకాలను వినియోగించుకోవాలన్నారు. గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలకు నిలయాలని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు గ్రంథాలయం నందు చదరంగం పోటీలు నిర్వహించారని ఈ పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభ నిరూపించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమాలు జూన్ 11వ తేదీ వరకు నిర్వహించబడతాయని విద్యార్థులు అందరూ పాల్గొనాలని కోరారు. ప్రతి విద్యార్థి ఖాళీ సమయంలో ఒక గంట సమయం గ్రంథాలయం నందు కేటాయించి విజ్ఞానాన్ని పెంచుకోవాలని తెలిపారు. సెల్ ఫోన్లకు సమయం కేటాయించకుండా పుస్తక పఠనం వైపు దష్టి కేంద్రీకరిస్తే విజ్ఞానవంతులు అవుతారని ఆయన సూచించారు.

**కడియం** కడియం శాఖా గ్రంథాలయం నందు మంగళవారం చదవడం మాకిష్టం లో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరం 30 వ రోజుకు చేరింది. సమ్మర్ క్యాంపు 30 వ రోజుకు విజయవంతంగా చేరుకున్న సందర్భంగా గ్రామం అంతా చదవడం మాకిష్టం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేసారు. ఉపాధ్యాయులు బుజ్జి బాబు విద్యార్థులకు కథల పోటీలు పెట్టారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్, క్రాఫ్ట్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల, భాస్కర్ రావు, దుర్గయ్య, కె.నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయం సిబ్బంది, రిజిస్ట్రార్ ఆఫీస్, టైలరింగ్ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.




కడియంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

## మహానాడు విజయోత్సవ సభ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక గాదాలమ్మ నగర్‌లోని బివిఆర్ కన్వెన్షన్ హాల్లో రాజమహేంద్రవరం సిటీ టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం మహానాడు విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి, రాజమహేంద్రవరం యోజకవర్గ పరిశీలకులు అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు), యర్రా వేణుగోపాల రాయుడు, లోహిత్ శిష్ట, కార్యదర్శి కాశి నవీన్ కుమార్ తదితరులు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రం... మన "భవిష్యత్తుకు గ్యారెంటీ" ఇచ్చేది కేవలం తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ నాయకులు అన్నారు.మహానాడు సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మ్యానిఫెస్టో మహాశక్తి మాటే ప్రతి నోటా వినిపిస్తోందన్నారు. ఆ మ్యానిఫెస్టో అందరికి చాలా బాగా నచ్చిందన్నారు. జగన్ చెపిన్నట్టు కల్లబొల్లి మాటలు చంద్రబాబు చెప్పరని, ఆయన చెప్పిందే చేస్తారని అన్నారు. అదే ఆయన నైజమన్నారు. మహిళకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టిడిపిని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ కక్ష సాధింపులు రాజమహేంద్రవరంలో ఎప్పుడు చూడలేదని ఆదిరెడ్డి వాసు అన్నారు. సెంట్రల్ జైల్లో ఉన్న తమను ములాఖత్ తో చంద్రబాబు నాయుడు వచ్చి తమకు భరోసా ఇచ్చారన్నారు. త్యాగాలు చేసే తమ కుటుంబానికి అండ ఉంటామన్నారని గుర్తు చేశారు. ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు రాజమహేంద్రవరంలో జరగడం మన అదృష్టమన్నారు. నగర టిడిపి వఅధ్యక్షులు రెడ్డి మణేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఛాంబర్ మాజీ అధ్యక్షులు దొండపాటి సత్యంబాబు, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, బిసి సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తి బాబు, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఉపాధ్య క్షులు మజ్జి రాంబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్య దర్శి నక్కా దేవివరప్రసాద్, నూర్ బాషా సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ షేక్ సుభాన్, తెలుగు మహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

## గ్రామాల దత్తత అభినందనీయం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కాలుష్య రహిత గ్రామాలుగా తీర్చి దిద్దేందుకు హిందుస్థాన్ యునీలివర్, యాజ మాన్యం సిఎస్ఆర్ ద్వారా గ్రామాలను దత్తత తీసుకోవడం అభిందనీయమని కలెక్టరు డాక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు రెవెన్యూ కాలనీలో హిందుస్థాన్ యునీలివర్ (హార్లిక్స్ ఫ్యాక్టరీ), సిఎస్ఆర్ లో భాగంగా యాజమాన్యం చేపట్టిన ప్రభాత్ వ్యర్థ పదార్థాల నిర్వహణ, పోషన్ సాతి కార్యక్రమాలను కలెక్టరు మాధవీలత ప్రారంబించారు. కలెక్టరు మాధవీలత మాట్లాడుతూ ధవళేశ్వరం, రాజవోలు గ్రామాలను దత్తత తీసుకోని వ్యర్థపదార్థాల నిర్వహణ కార్యక్రమాలను చేపట్టి అమలు చేయడం ప్రోత్సహించ తగ్గ విషయమన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పెద్ద ఎత్తున సాలిడ్ వేస్టు మేనేజ్ మెంట్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ కార్యక్ర మాలను కాలుష్య నివారణ కొరకు పెద్ద ఎత్తున జిల్లా యంత్రాంగం చేపట్టి అమలు చేస్తుందన్నారు. దీనికి తోడు ప్రజలు, పరిశ్రమల భాగస్వామ్యం ఉంటే మరింత సాధ్యమవుతుం దన్నారు. మంగళవారం హిందుస్థాన్ యునీలి వర్, యాజమాన్యం బొమ్మూరు, రాజవోలు గ్రామాలను దత్తత తీసుకొని కాలుష్యరహిత గ్రామాలుగా తీర్చి దిద్దే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్ళి చెత్త సేకరణ చేసేందుకు 7 నూతన వాహనాలు ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాధవీలత చెత్త సేకరణ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. హిందుస్థాన్ యునీలివర్, సీఎస్ఆర్ భాగస్వా మ్యంతో ప్రజారోగ్య పరిరక్షణకు తమ వంతు సహకారంగా కొవ్వూరు, కడియం, రాజమహేంద్ర వరం రూరల్, సీతానగరం మండ లాల్లోని 53 గ్రామాల్లో గల 107 సచివాలయాల పరిధిలోగల 4.5 లక్షల ప్రజలకు ఆరోగ్య సమతుల్యత కార్యక్ర మాల పై అవగాహన నిర్వహి స్తామని పభాత్ సిఎస్ఆర్ ప్రతినిధి మంధీరానగ్రాత్ అన్నారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ సత్య నారాయణ, మ్యాన్యుఫాక్చరింగ్ మేనేజర్ శేషు కుమార్, ఫ్యాక్టరీ హెచ్ ఆర్ మేనేజరు ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

## ప్రగతి దిశగా అడుగులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు, పరిశుభ్రత పాటించడం ద్వారా తూర్పు గోదావరి జిల్లా కు జాతీయ స్థాయి లో లభించిన గుర్తింపు నిలపడం తో మరింత ప్రగతి దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. మంగళవారం భారత ప్రభుత్వ తాగునీటి శాఖ జల్ జీవన్ మిషన్ కార్యదర్శి విన్నీ మహాజన్ దేశ వ్యాప్తంగా పలు జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జేసీ ఎన్.తేజ్ భరత్, ఆర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ డి..బాలశంకరం, డ్వామా పీడీ జిఎస్.రామ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు. భారత ప్రభుత్వ తాగునీటి శాఖ జల్ జీవన్ మిషన్ కార్యదర్శి విన్నీ మహాజన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు కు కావలసిననిధుల కేటాయింపు సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-నిడదవోలు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభించిందని మార్కంపాడు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ పి. రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని డి. ముప్పవరం గ్రామంలో ఆరోగ్య కేంద్రం నందు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించి రోగులను పరీక్షించి అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందించారు. సుమారు 118 మంది రోగులకు వివిధ రకాలడ వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మంచానికే పరిమితమైన రోగులకు సైతం వారి ఊర్లోనే వారి ఇంటి దగ్గరే అవసరమైన వైద్యం అందజేయాలన్న ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విదానాన్ని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె. కనకరత్నం హాజరై ప్రస్తుతం వేసవికాలం కనుక ప్రజలు అంటువ్యాధులు వాంతులు, విరోచనాలు తదితర అనారోగ్య సమస్యల బారినపడకుండా పలు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బుగ్గి సురేష్ ఇంటింటికీ ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అందరూ కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎఎన్ఎం పి.నాగలక్ష్మి, ఎం ఎల్‌హెచ్‌పి కె.లక్ష్మి కుమారి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది సతీష్, డిఇఒ విజయ్ పాల్గొన్నారు.



వైద్యపరీక్షలునిర్వహిస్తున్న దృశ్యం



ఎంఎల్ఎ జక్కంపూడి రాజాను కలిసిన ఎంఇఒ

## పిఆర్‌సి, ఫిట్మెంట్ సకాలంలో అందేలా చూడాలి

ప్రజాశక్తి-కడియం

పిఆర్‌సి, ఫిట్మెంట్ సకాలంలో అందేలా ప్రతిపాదనలను సిఎం దష్టికి తీసుకువెళ్లాలని రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజాను కడియం ఎంఇఒ వి.లజపతిరాయ్, వైఎస్ఆర్ టిఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.జయరాజులు కోరారు. 12వ పే రివిజన్ కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందుకు ఎంఎల్ఎ జక్కంపూడి రాజాకు అభినందనలు తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి 11 వ పిఆర్‌సి గడువు పూర్తికానున్న దష్ట్యా కాలయాపన లేకుండా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టడం, సకాలంలో ఉపాధ్యాయ బదిలీలు పూర్తి చేసే షెడ్యూల్ విడుదల చేసి ఆమేరకు ప్రక్రియ మొదలుపెట్టి చురుగ్గా పూర్తి చేయడం మంచి పరిణామమన్నారు. ఉద్యోగులందరూ మెరుగైన పిఆర్‌సి ఫిట్మెంట్ అందుకునేలా చర్యలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి-రాజానగరం

ప్రమాదాలకు కారణమైన ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్.ఎస్.ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా 'ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపస్ ప్రోగ్రామ్' ను వారం రోజుల పాటు నిర్వహిస్తున్నారు. దీనిపై వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ భూమిపై, నీటిలో 20 శాతం జీవజాతులు ప్లాస్టిక్ వంటి వ్యర్థాల కారణంగా మరణిస్తున్న యన్నారు. మానవ ఆరోగ్యానికి ముపప్పుగా మారిన ప్లాస్టిక్ ను నిషేధించి క్లాత్ బ్యాగ్స్ ఉపయోగించాలని తెలిపారు. 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారాలు' అనే అంశంతో ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయ అని దీనిలో భాగంగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఏడు రోజుల ప్లాస్టిక్ వ్యర్థాలు తీసివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సైన్స్ కాలేజ్, ఎన్ఎస్ఎస్ విభాగాలను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, విశ్వవిద్యాలయ అధికారులు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### కత్తిపోట్లకు దారితీసిన ఆస్తి తగాదా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఆస్తి తగాదా అన్నదమ్ముల మధ్య కత్తిపోట్లకు దారి తీసింది. ఈ ఘటన మండలంలోని సి.రాయవరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏలేశ్వరం ఎస్ఐ జి.సతీష్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని సి.రాయవరం గ్రామానికి చెందిన కేశవరపు రాజబాబు, కేశరపు వెంకటేశ్వరరావు అన్నదమ్ములు. వారికి ఏలేశ్వరం మెయిన్‌రోడ్‌లో నాలుగు దుకాణాలు ఉన్నాయి. వాటి పంపకాల విషయంలో కొంతకాలంగా వీరి మధ్య తగాదా నడుస్తుంది. ఈ నేపథ్యంలో మంగళవారం మళ్లా తగాదా ఏర్పడింది. కేశవరపు రాజుబాబుపై వెంకటేశ్వరరావు అతని కుమారుడు ప్రసాద్ కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రాజబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే రాజబాబుని ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడకు తీసుకెళ్లారు. రాజబాబు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

### సారా కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో ఎస్ఇబి సిఐ కెవి.స్వామి ఆధ్వర్యంలో మంగళవారం సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ తెలిపారు. వివిధ సారా కేసులకు సంబంధించిన ఏడుగురిపై బైండోవర్ కేసులు పెట్టి జగ్గంపేట తహశీల్దార్ కోర్టులో హాజరు పరిచామన్నారు. గుడివాడ గ్రామంలో పరివర్తన కార్యక్రమంలో భాగంగా సారా, మత్తు పదార్థాల వినియోగం, అనర్థాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి జాతీయ రహదారిపై సింగరంపాలెం వెళ్లే కూడలి వద్ద మంగళవారం మోటార్ సైకిల్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరుకొండ మండలం గాదరాడకు చెందిన వనం అప్పారావు జగ్గంపేట వైపు నుంచి మురారికి వెళ్తున్నాడు. పక్కనున్న ఆటో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడింది. గాయాలైన అప్పారావును 108లో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పులిమేరులో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీమంతుల రాజు (45) మంగళవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రాజపూడికి చెందిన రాజు పులిమేరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. ఈనెల 4న బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయిందని పోలీసులు తెలిపారు. అప్పటి నుంచి రాజు కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని ఎస్ఐ వి.సురేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### ఎడ్ల బండి బోల్తా

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి ఏటిగట్టుపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎడ్ల బండి బోల్తాపడింది. ఒక ఎద్దు మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఎడ్ల బండి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒక ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఎద్దుకు గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాస్‌ను రాజమండ్రి తరలించారని హెచ్‌సి భగవాన్‌దాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### కోటిపల్లి రేవులో మత్స్యకారుని మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని కోటిపల్లి రేవులో మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. రేకాడి శ్రీను సోమవారం రాత్రి పడవపై వెళ్తూ ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోయాడు. మృతదేహం మంగళవారం లభ్యం అయింది మతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య రేకాడి నూక రత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కె.గంగవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### యాక్టివాను దగ్ధం చేసిన దుండగులు

ప్రజాశక్తి-ఆలమూరు

మండల కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి యాక్టివా స్కూటర్ను తెలియని దుండగులు దగ్ధం చేశారు. స్థానిక రథం వీధిలో ఉంటున్న భూపతిరాజు సుధాకర్ రాజు ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్న తన యాక్టివా స్కూటర్ను ఎవరో పెట్రోల్ పోసి నిప్పు పెట్టి దగ్ధం చేసినట్లు గుర్తించారు. జరిగిన ఘటనపై సుధాకర్ రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిత్యం రద్దీగా ఉండే రథం వీధిలో ఇటువంటి సంఘటన జరగడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుండగులను వెంటనే గుర్తించి శిక్షించాలని వారంతా పోలీసులను కోరారు.

### చోరీ కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి- రామచంద్రపురం

పట్టణం లోని చింతపల్లి సూరన్న నగర్ కి చెందిన అయినవిల్లి ప్రసాద్ ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇవి.. గత నెల మే 30 న ఇంటికి తాళం వేసుకుని పని నిమత్తం తణుకు వెళ్లిన ప్రసాద్ ఇంట్లో ఆ రోజు రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి సుమారు 20 గ్రాముల బంగారం, రూ. 30 వేల నగదు దొంగిలించారు. ఈ ఘటనపై ఫిర్యాదును పట్టణ ఎస్ఐ డి.సురేష్ బాబు నమోదు చేశారు. రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్ కె.ప్రసాద్ పర్యవేక్షణలో, సిఐ వి.దుర్గారావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. రాజనగరం మండల పరిధిలోని రాధేయపాలెం గ్రామానికి చెందిన రెడ్డి సురేష్‌ను నిందితునిగా గుర్తించి కొత్తూరు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. అతని వద్ద నుంచి బంగారం మొత్తం ను రికవరీ చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపించామని ఎస్ఐ తెలిపారు. చోరులను గుర్తించడంలో కీలక పాత్ర వహించి, త్వరితగతిన కేసును ఛేదించిన ఎస్ఐ డి.సురేష్ బాబు, కానిస్టేబుల్స్ జగదీష్, సూరిబాబు, హోం గార్డ్స్ మహేష్, కుమార్ రాజాలను ఎస్పి. ఎస్.శ్రీధర్ అభినందించారన్నారు.

# సర్పంచ్‌ల హక్కుల కోసం ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - కాకినాడ

హక్కుల రక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయాలని, దీనికి రాజకీయ పార్టీలకతీతంగా కలిసి రావాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ సర్పంచ్‌లకు పిలుపునిచ్చింది. మంగళవారం కాకినాడలోని సత్కలవాహిని ఆడిటోరియంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వైబి.రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12,900 పంచాయతీలకు ఆర్థిక సంఘం 2021 నిధులను విడుదల చేసినా అవి ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి మళ్లించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్రం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో కలిపి 2021-22 సంవత్సరానికి రూ.8,860 కోట్ల పంచాయతీ నిధులు రాష్ట్ర ప్రభుత్వం చోరీ చేసిందన్నారు. ఈ మేరకు పంచాయతీ ఛాంబర్ తరపున కేసు నమోదు చేశామని, త్వరలోనే కోర్టు దీనిపై తీర్పు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని సర్పంచ్‌లు అందరూ హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధి కోసం పోరాడాలన్నారు. సర్పంచ్‌ల సమర శంఖారావం పేరుతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని ప్రకటించారు. ఈ ఉద్యమంలో వార్డు సభ్యులనూ భాగస్వాములు చేయాలన్నారు. ఉద్యమంలో భాగంగా జిల్లా పరిషత్, కలెక్టరేట్ల వద్ద భారీ ధర్నాలు, చలో ఢిల్లీ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌ల పరిధిలోకి సచివాలయాలు, వాలంటీర్లను తీసుకు రావాలన్నారు. సచివాలయం కన్వీనర్లగా రాజకీయ పార్టీ కన్వీనర్ల వ్యవస్థను రద్దు చేయాలన్నారు. గ్రామ సచివాలయాల పేరుతో ఎంఎల్‌ఎలకు రూ. 20 లక్షల నిధులను పంచాయతీలకు ఇవ్వాలన్నారు. సర్పంచుల ద్వారానే వీటిని అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలన్నారు. అలాగే సర్పంచ్, ఎంపిటిసిలకు రూ.15వేలు, ఎంపిపి, జడ్‌పిటిసిలకు రూ.30 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయన్నారు. దీంతో చాలా గ్రామాల్లో సర్పంచులు సొంత నిధులను ఖర్చుపెట్టి పలు పనులను నిర్వహించారన్నారు. నిధులు లేక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం నాయకులు నాగాబత్తుల శాంతికుమారి, కాకర శ్రీనివాస్, బొబ్బ ప్రభాత్‌కుమార్, సలాది బుచ్చిరాజు, రంబాల రమేష్, గుడాల రాంబాబు, వారా జయసావిత్రి, బూసి జయలక్ష్మి, వేజర్ల ప్రమోద్ కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న రాజేంద్రప్రసాద్

## యానాం వార్తలు


భారీ కేక్‌ను కట్ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

### ఘనంగా మల్లాడి పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 60వ పుట్టినరోజు వేడుకలు స్థానిక యత్రా గార్డెన్‌లోని మల్లాడి స్వగృహం వద్ద అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా మల్లాడి కృష్ణారావు ఉదయలక్ష్మి దంపతులను, కుమారుడు వంశీ, అనుపమ దంపతులను పండితులు వేద ఆశీర్వచనం అందించారు. వందలాది మల్లాడి అభిమానులతో యానాంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ తన పాటలతో, ప్రసంగాలతో అలరించారు. యానాం కళాకారులు, పల్సర్ బైక్ ఝూన్సీ, పొట్టి రమేష్, జెట్టి చిత్ర బృందం చేసిన డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. పుట్టిన రోజు సందర్భంగా కిడ్నీ రోగులకు ఉచితంగా డయాలసిస్ చేసేందుకు అపోలో అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను ఓల్డేజ్ హోమ్ కో-ఆర్డినేటర్ పెసల గంగయ్యకు అందించారు. అభిమానులు మధ్య మల్లాడి కృష్ణారావు భారీ కేకును కట్ చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్, జనసేన నాయకులు పితాని బాలకృష్ణ, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, పలువురు ప్రముఖులు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. గజమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. మల్లాడి అభిమాన సంఘం ద్వారా విందు భోజనం ఏర్పాటు చేశారు. ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిడ్ల చంద్రరావు, పెండెం సూర్య ప్రకాష్, కోన కొండబాబు, గూటం శివగణేష్, మల్లాడి రాజు, మల్లాడి అభిమానులు పాల్గొన్నారు.


పొగతో మూసుకుపోయిన రహదారి

### పొగతో ఉక్కిరిబిక్కిరి

యానాం నియోజకవర్గ పరిధిలోని కనకాల పేట డంపింగ్ యార్డలో చెత్తకు నిప్పుపెట్టడంతో దుర్వాసన, పొగతో స్థానికులు, ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తకు నిప్పు పెట్టి వదిలేశారని వారంటున్నారు. వెంటనే మంటలను అదుపు చేసి కాలుష్యాన్ని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

### మందుబాబులకు అడ్డాగా మార్కెట్ కాంప్లెక్స్

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని రాజీవ్ గాంధీ మార్కెట్ కాంప్లెక్స్ మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో మత్స్యకారులు,వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజూ మార్కెట్ ప్రాంతంలో మద్యం సేవించిన తర్వాత కాళీ బాటిళ్లను అక్కడే వదిలేయడం, కొన్ని పగుల గొట్టడంతో మార్కెట్లోకి వచ్చేవారు గాయపడుతున్నారు. మార్కెట్ కాంప్లెక్స్‌లో ఎటువంటి నిఘా లేకపోవడంతో మందుబాబుల ఆగడాలు మితిమీరుపోతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సాయంత్రం సమయానికి మద్యం సేవించడానికి మందుబాబులు మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మద్యం సేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మార్కెట్ కాంప్లెక్స్‌లో తాగి పడేసిన మద్యం బాటిళ్లు

# అంబులెన్స్‌లో ప్రసవం..

ప్రజాశక్తి-రావులపాలెం

ప్రసవ వేదనతో బాధపడుతున్న మహిళను స్థానిక వైద్యులు సూచన మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ఆ మహిళ ప్రసవించింది. రావులపాలెం మండలం ఉబలంక గ్రామానికి చెందిన శీలం భవాని పురిటినొప్పులతో బాధపడుతుండగా సమీపంలో గల ప్రాథమిక కేంద్రానికి తరలించారు. అయితే ఆమెకు గర్భంతో ఉండగా వచ్చే ఫిట్స్ (గుర్రపు వాతం) అధికమవ్వడంతో ఆమెను వెంటనే రాజమహేంద్రవరం తరలించాలని స్థానిక ఆసుపత్రి వైద్యులు సూచించారు. వెంటనే ఆమెను 108 అంబులెన్సు ద్వారా తరలిస్తుండగా వేమగిరి దాటిన తర్వాత పురిటి నొప్పులు అధికమై బిడ్డ బయటికి వస్తుండగా ఇఎంటి.చిట్టిబాబు, అంబులెన్సు డ్రైవర్ (పైలెట్) సిహెచ్.దేవేంద్రబాబు సహాయంతో అంబులెన్స్ లోనే చాకచక్యంగా సులువైన ప్రసవం చేసి బిడ్డను సురక్షితంగా బయటికి తీశారు. అనంతరం తల్లీ బిడ్డకు వైద్య సదుపాయాన్ని అందిస్తూ జిల్లా ఆసుపత్రి రాజమహేంద్రవరం తరలించారు. తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారని రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యులు తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



# టిడిపి ఎంఎల్‌ఎల అరెస్టులు అక్రమం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

టిడిపి ఎంఎల్‌ఎలు బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు అరెస్టులు అక్రమమని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. సామర్లకోట మండలం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎంఎల్ఎ డోలా బాల వీరాంజనేయస్వామిపై వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకు నిరసన తెలిపే హక్కులేదా? అని ఆయన ప్రశ్నించారు. వైసిపి నేతలకు పోలీసులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. అక్రమ అరెస్టులు, వేధింపులకు భయపడేది లేదన్నారు. వైసిపి నాయకుల అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటే అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు. ఎంఎల్ఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధులు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇతర కార్యక్రమాలు ప్రజలకు అందించడంలో వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు పనిచేస్తూ కీలక పాత్ర పోషిస్తున్నారని ఎపీ స్టేట్ హౌసింగు కార్పోరేషన్ చైర్మన్, దవులూరి దొరబాబు పేర్కొన్నారు. పెదబ్రహ్మదేవంలో మంగళవారం వాలంటీర్లను సత్కరించారు. దవులూరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కొంత వాలంటీర్ల వ్యవస్థపై విపక్షం చేస్తున్న ఆరోపణలను ఖండించారు. వాలంటీర్లను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైస్ ఎంపిపి పేర్నిడి వెంకటరాయుడు ఎంపిడిఒ డి.శ్రీలలిత, తహశీల్దార్ లక్ష్మీనరసకుమారి, ఇఒపిఆర్‌డి హరికృష్ణ సత్యారెడ్డి, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపిటిసి మలకల సూర్యారావు (సూరిబాబు), సొసైటీ అధ్యక్షులు మలకల వరాలబాబు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.



### మల్లాడికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీకాంత్

**అమలాపురం :** మాజీ మంత్రి మల్లాడి కష్ణారావు పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ మంగళవారం ఆయన స్వగహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లాడికి పుష్ప గుచ్ఛం అందించారు.

### విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు వ్యాకరణం, తెలుగు పద్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్‌పురానికి చెందిన తెలుగు పండిట్ ఎం.రుషికుమార్, రిటైర్డ్ హిందీ పండిట్ ఎఎస్ఆర్‌కెఎస్.ప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులకు స్వీకరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లో ఖాళీగా ఉన్న 8 అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.గజలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె ఈ పోస్టులకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు కపిలేశ్వరపురం మండలంలోని నల్లూరు-1లో (బిసి-ఇ), పడమర ఖండ్రికలో (బిసి-ఎ), కపిలేశ్వరపురంలో (ఎస్‌టి) కి కేటాయించారన్నారు. అలాగే కె.గంగవరం మండలం నరజాడ (బిసి-ఎ), రావిదొడ్డిపేట (ఎస్ సి ), తామర పల్లి (ఒసి), శేరేలంక(ఒసి), కె.గంగవరం 3 (బి సి-డి)లకు కేటాయించారన్నారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు వివాహిత మహిళా అభ్యర్థినులై ఉండి పదవ తరగతి ఉత్తీర్ణత, 21 సంవత్సరాల నుంచి 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా ఐసిడిఎస్ కార్యాలయం లో అందజేయవచ్చన్నారు. వివరాలకు ఐసిడిఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.



### రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి-మండపేట

ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంలో అసువులు బాసిన వారికి నివాళిగా మండపేట పట్టణంలో జాతీయ బిసి సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బిసి సంఘ నాయకులు పిల్లి శ్రీనువాస్, కోన సత్యనారాయణలు మాట్లాడుతూ ఇది దేశంలో నాలుగో అతిపెద్ద రైలు ప్రమాదం అన్నారు. ఓ చిన్నపాటి నిర్లక్ష్యం వందల కుటుంబాల్లో తీరని దుఖాన్ని మిగిల్చిందన్నారు. ఈ ఘటనపై సిబిఐ విచారణ చేసి ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం చెల్లించి ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు పెంకె గంగాధరరావు, టేకి శ్రీను, శీలామంతుల సత్యనారాయణ, చుక్కల అప్పారావు,చుక్కల సూరిబాబు, సూరంపూడి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### అందరికీ సంక్షేమ పథకాలు

**పెద్దాపురం :** వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం కొండపల్లిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు..ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, సర్పంచ్ కొత్త చక్రరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఘనంగా అశోక్ పుట్టినరోజు

**అయినవిల్లి :** చింతలంక గ్రామానికి చెందిన అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ వైస్ ప్రెసిడెంట, పి.గన్నవరం నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షుడు గల్లా అశోక్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఒక్క లంక బుల్లియ్య, అమలాపురం ఎస్‌సి నాయకుడు చిన్నం బాల విజయ రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులు అశోక్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, చిక్కం పల్లంరాజు, మోక శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## సంక్షిప్త వార్తలు


సైన్సు ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

### శాస్త్ర సాంకేతికతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుంచి విద్యార్థులు శాస్త్ర సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని జెవివి సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ అన్నారు. యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో మంగళ వారం ఆయన సైన్స్ ప్రయోగాలపై అవగాహన కలిగించారు. పూజిత సూర్యశ్రీ కరాటేలో శిక్షణ ఇచ్చారు. ఈ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులందరికీ గల్లా కృష్ణ, హర్ష సాయి సేవా సమితి వారు బిస్కెట్లు, స్నాక్స్, గుడ్లు అందించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ అరుణ్ కుమార్,రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**చిత్రలేఖనం పోటీలు**

స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు మంగళవారం పర్యావరణం పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపు కో-ఆర్డినేటర్ రొంగల అరుణ్‌కుమార్ మాట్లాడారు. గత నెల 7 నుంచి నిర్వహిస్తున్న ఈ సమ్మర్ క్యాంపు ఈనెల 9న ముగుస్తుందన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. 9న జరిగే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రకారుడు దుంగల శ్యామ్‌కుమార్, పూజిత, సత్య, కూనిరెడ్డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.